హార్సిలీహిల్స్ సందర్శకులపై ఆంక్షలు షురూ


చెక్‌పోస్టు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రామమోహన్

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నూతన ఏడాది వేడుకలు జరుపుకునేందుకు వచ్చే సందర్శకులపై పోలీసుల ఆంక్షలు శనివారం సాయంత్రం నుంచి అమలులోకి వచ్చాయి. ఘాట్‌రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా, కుటుంబాలతో వచ్చే సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు కొండకింద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఎస్‌ఐలు సుకుమార్, రామమోహన్, సిబ్బంది విధులు నిర్వహిస్తూ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మద్యం తీసుకెళ్లడంపై నిషేధం పెట్టగా వాటికోసం తనిఖీలు చేస్తున్నారు. బైక్, ఆటోలను కొండపైకి వెళ్లడం రెండురోజుల నిషేధం విధించారు. సోమవారం వరకు పోలీసు చెక్‌పోస్టు కొనసాగనుంది. సందర్శకుల భద్రతకు చర్యలు తీసుకొంటున్నారు.

డిజిటల్ ధ్రువపత్రాలు అందజేయండి

- డీటీఓ మహబూబ్‌బాషా

బి.కొత్తకోట: ఉద్యోగ విరమణ చేసి ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న పెన్షనర్లు ఏటా సమర్పించాల్సిన వార్షిక ధ్రువీకరణ పత్రాలను డిజిటల్ విధానంలో జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా సమర్పించాలని జిల్లా ఖజానా, అకౌంట్స్ ఆఫీసర్ యస్.మహబూబ్‌బాషా శనివారం క ప్రకటనలో కోరారు. ఈ వివరాలను సమర్పించేందుకు జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28 వరకు గడువు ఉందని తెలిపారు. పెన్షన్లు పొందుతున్న వారు ఆధార్, పెన్షన్ పుస్తకం, బ్యాంకు ఖాతా నంబర్, ఫోన్ నంబర్లను సమర్పించాలని తెలిపారు. బయోమెట్రిక్ సమస్య ఉన్నవాళ్లు నేరుగా కార్యాలయంలో వివరాలు అందించాలని కోరారు. వివరాలకు ఆయా ప్రాంతాల జిల్లా, ఉప ఖజానా కార్యాలయాల్లో లేదా మీసేవ కేంద్రాలు, పెన్షన్‌దారుల సంఘ కార్యాలయాలను సంప్రదించాలని కోరారు.

సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించండి

ఎమ్మెల్యే నవాజ్‌బాషా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చిత్రంలో నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్ తదితరులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా మూడున్నరేళ్ల కాలంలో ప్రతి గ్రామంలో జరిగిన మేలును ప్రజలకు వివరించే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తీసుకోవాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో శనివారం మదనపల్లె వైఎస్సార్ సీపీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి? ప్రజాసంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నా.. దుష్ప్రచారం చేస్తున్న ఎల్లోమీడియా, ప్రతిపక్షాలను ఎలా అరికట్టాలనే విషయాలపై చర్చించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వలంటీర్లను సమన్వయం చేసుకుని ప్రజలతో మమేకమవ్వాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పార్టీ అభ్యున్నతికి పాటుపడాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ..చంద్రబాబుకు పదవీవ్యామోహం, దోచుకోవడం..దాచుకోవడం తప్ప ప్రజా సంక్షేమం పట్టదన్నారు. కందుకూరులో లేని ప్రజాభిమానాన్ని నిరూపించుకోవాలనే ప్రయత్నంలో అమాయకులైన 8మంది ప్రాణాలను పొట్టనపెట్టుకున్నాడన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనంద పార్థసారథి, వెలుగుచంద్ర, సింగిల్‌విండో చైర్మన్ దండుకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్‌చైర్మన్ వెంకటరమణ, వైస్ ఎంపీపీ నందినితాజ్, పసుపులేటి రమణ, సీటీఎం క్రాస్ అభివృద్ధి కమిటీ చైర్మన్ బండపల్లి వెంకటరమణ, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

రామసముద్రం: విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శనివారం ఆయన రామసముద్రం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని జగనన్నకు మంచి గుర్తింపుతో పాటు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావలన్నారు. అనంతరం 672 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

పార్టీకి వలంటీర్లు పట్టుకొమ్మలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వలంటీర్ల వ్యవస్థ పట్టుకొమ్మలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శనివారం సాయంత్రం మినికి గ్రామంలో మండలం గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు వెళ్లి వివరించాలన్నారు. సీఎం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, ఎంపీపీ కుసుమకుమారి, వైస్ ఎంపీపీలు రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, గెవన్న, వేణు, రాధా, నంద, ప్రకాష్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

‘గడప గడపనా’ ఆత్మీయ ఆదరణ

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: గడపగడపకు మన ప్రభుత్వానికి మంచి స్పందన వస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నగిరిమడుగు పంచాయతీ షికారిపాల్యెం, పాతకోటపల్లి, ముష్టూరువాండ్లపల్లి, కొత్తపల్లి, చిన్ననారాయణపల్లి, బురుజుగడ్డ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే చింతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారని, భవిష్యత్తులో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డినే గెలిపించుకుంటామని చెబుతుండడం సంతోషంగా ఉందన్నారు. అవినీతి రహితంగా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు ఆస్వాధిస్తున్నారని స్పష్టం చేశారు. మరింత మెరుగైన పాలన సాగించేందుకు ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి సత్వర పరిష్కారానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, సర్పంచ్‌లు రజని, జయచంద్ర, నాయకులు చింతల ఆనంద రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, సురేంద్ర రెడ్డి, రెడ్డెప్ప, ఈశ్వర్ రెడ్డి, పాల్‌రెడ్డి, ఆనంద, రాయుడు, సురేష్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక :
ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి సమక్షంలో శనివారం మండలంలోని నగిరిమడుగు పంచాయతీ కొత్తపల్లి, పాతకోటపల్లి, చిన్ననారాయణపల్లికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మునిరాజ, మునిప్రసాద్, వెంకట్రమణ, బాబు, పవన్‌కళ్యాణ్, భానుప్రసాద్, వంశీ, రామనాథం, శ్రీనివాసులు, అరవింద్, భాను, చందు, అన్నయ్య, రామాంజులు, రవితేజ, మునయ్య, అనిల్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన


కొత్తపల్లెలో గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీఓ రంగస్వామి

పీలేరురూరల్ : మండలంలోని మేళ్లచెరువు పంచాయతీ కొత్తపల్లెలో వివాదాస్పద స్థలాన్ని రాయచోటి ఆర్డీవో రంగస్వామి పరిశీలించారు. కొత్తపల్లెలో దారికి అడ్డుగా ఓ వ్యక్తి ఇళ్లు నిర్మిస్తుండడంతో గ్రామస్తులు కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆర్డీవో గ్రామంలో పర్యటించి స్థలానికి సంబంధించి రికార్డులు పరిశీలించారు. దారిని, ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి ఇరు వర్గాలతో చర్చించారు. నివేదిక జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో వెంకటరమణ, విలేజ్ సర్వేయర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పద్దు రూ.105.55 కోట్లు


అజెండాలోని అంశాలపై చర్చిస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

- కౌన్సిల్ సమావేశంలో వార్షిక బడ్జెట్‌కు ఆమోదం
- పచ్చదనానికి, మౌలిక వసతులకు ప్రాధాన్యత

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్‌కును కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. శనివారం జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో రూ.105.55 కోట్ల బడ్జెట్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి కౌన్సిల్ ఎదుట ప్రవేశపెట్టారు. పట్టణంలో ప్రజావసరాలకు అనుగుణంగా, పచ్చదనం పెంపు లక్ష్యంతో, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా సూచనల మేరకు, పట్టణంలో చేయాల్సిన పలు అభివృద్ధిపనులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించామన్నారు. స్వచ్ఛ మదనపల్లెగా పట్టణాన్ని తీర్చిదిద్దే క్రమంలో పారిశుధ్యనిర్వహణ, సీసీ రోడ్లు, డ్రెయిన్లకు సంబంధించి పెద్దమొత్తంలో నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కమిషనర్ ప్రమీల, డీఈ బండపల్లి శిరీషా, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి


ర్యాలీ చేస్తున్న ఏపీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు

పీలేరురూరల్ : బీసీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని ఏపీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ రాయల్ బాబురాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 డిసెంబర్ 31వ తేదీన 40 సిఫార్సులతో కూడిన మండల కమిషన్ నివేదిక పార్లమెంట్‌లో సమర్పించారన్నారు. పదేళ్ల అనంతరం వి.పి. సింగ్ ప్రధాన మంత్రిగా ఉండగా విద్యా ఉద్యోగ నియామకాల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించి ఒక సిఫార్సు మాత్రమే అమలు పరిచారన్నారు. మిగిలిన 39 సిఫార్సులు ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం బీసీ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు గుర్రం నారాయణ, వెంకటరమణ, రమేష్, మహేష్, పురుషోత్తం, మురళి, చంద్ర, జనార్దన తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని నిరసన

బి.కొత్తకోట: 15ఏళ్ల క్రితం మూసివేసిన ఆర్టీసీ డిపోను మళ్లీ ఏర్పాటు చేయాలని కోరుతూ కోసం స్థానిక సీపీఐ నాయకులు, కార్యకర్తలు శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. డిపో లేకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి డిపో ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్.సలీంబాషా కోరారు. సీనియర్ నాయకులు బషీర్‌ఖాన్, సమీవుల్లా, గంగులప్ప, బాలకృష్ణ, కదిరప్ప, మస్తాన్, గంగాద్రి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

పీలేరు : అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ఎంఈవో బాలాజీ నాయక్ చేతుల మీదుగా డైరీ, క్యాలెండర్, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ట్రెజరర్ అక్రమ్‌బాషా, జిల్లా సహాధ్యక్షుడు శివారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, వేణుగోపాల్, జి. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల మురుగు సమస్యకు పరిష్కారం

- రూ.32 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం

మదనపల్లె : పట్టణ నడిబొడ్డున దశాబ్దాల కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న మురుగు సమస్యకు పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాలతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు డ్రెయిన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని బందరు మిఠాయి దుకాణం నుంచి బాహుదాకాలువలోకి రూ.32లక్షల వ్యయంతో 190 మీటర్ల మురుగునీటి కాలువ నిర్మాణపనులకు ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో 22వవార్డు కౌన్సిలర్ ముబీనా, నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, కౌన్సిలర్ మేస్త్రీశ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, వీఎస్ఆర్ గ్రాండ్ సుధాకర్‌రెడ్డి, సింహపురి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె నుంచి పుంగనూరుకు బస్సు సర్వీసు

నిమ్మనపల్లె : మండల కేంద్రమైన నిమ్మనపల్లె నుంచి పుంగనూరుకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పుంగనూరు ఆర్టీసీ డిపో అధికారులు ఏర్పాటు చేశారు. గత కొద్దిరోజులుగా ప్రజలు కోరుతున్నట్లు నిమ్మనపల్లె నుంచి బోయకొండ మీదుగా పుంగనూరుకు బస్సు సర్వీసును ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుట్రిప్పుల చొప్పున బస్సు సౌకర్యం ఉంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలి

మదనపల్లె సిటీ: జూనియర్స్, సీనియర్స్ అనే బేధం లేకుండా అందరూ కలిసి స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు.శనివారం కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు సీనియర్ విద్యార్థినులు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే ఉల్లాసంగా జరుపుకున్నారు. ఆమె మాట్లాడుతూ కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ కాలేజీలో చదువుకోవడం గొప్పవరమన్నారు విద్యార్థి యూనియన్ చైర్మన్‌గా నిరోషాను ఎన్నుకున్నారు.

నూతన సంవత్సరానికి చర్చ్‌లు, ఆలయాలు ముస్తాబు


విద్యుత్ వెలుగుల్లో జెసీఎం చర్చి

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో చర్చిలు, ఆలయాలు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముస్తాబు చేశారు. స్థానిక జెసీఎం చర్చి, సెయింట్ లూక్, ఆరోగ్యవరం చర్చి, గుడిసివారిపల్లె చర్చి, బెంగళూరు రోడ్డులోని ఆరోగ్యమాత చర్చిలు రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరణ చేశారు. ఆదివారం స్థానిక జెసీఎం చర్చిలో ఉదయం 9.30 గంటలకు పరిశుద్ధ సంస్కారపు ఆరాధనలు నిర్వహిస్తున్నట్లు డివిజన్ సంఘ కాపరి రెవ.సునిల్‌వరకుమార్ తెలిపారు. స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయం, యోగభోగేశ్వరస్వామి ఆలయం, వరాల ఆంజనేయస్వామి ఆలయాలు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అగ్రహారం, కాకులారంపల్లె గ్రామ సచివాలయాల్లో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో ఉన్న సేవలన్నీ ప్రజలకు అందించాలన్నారు. గ్రామాల్లో జనన, మరణాలు వివరాలు విధిగా నమోదు చేయాలన్నారు. గూడరేవుపల్లె గ్రామ సచివాలయంలో రైల్వే టికెట్ బుకింగ్ సౌకర్యం ఉందన్నారు. అలాగే గ్రామసచివాలయాల్లో విద్యుత్ బిల్లులు చెల్లించే సౌకర్యం ఉందని తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ చంద్రారెడ్డి, హరిణి, హబీబ్‌బాషా, ఎంపీటీసీలు అమరనాథరెడ్డి, బింధు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాలం నరేంద్రరెడ్డి, సురేంద్రరెడ్డి, కాకులారంపల్లె రమేష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీ నెట్టిబండకు చెందిన సుమారు 70 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం అగ్రహారంలో సర్పంచ్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ అమరనాథరెడ్డి, మాజీ సర్పంచ్ బాలం నరేంద్రరెడ్డి, దిన చంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె. రామాంజులు, సుబ్రమణ్యం, రాము, మోహన్, సుబ్రమణ్యం, శీను, నరేష్, పద్మావతి, గౌరి, గిరిజ, అనసూయ్య, కళావతి, వీరనాగమ్మ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించండి

నిమ్మనపల్లె : నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలన వివరించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ మండల సర్వసభ్య సమావేశానికి నియోజకవర్గ పరిశీలకు హబీబుల్లాఖాన్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రజల వద్దకు వెళ్లాలన్నారు. ప్రతిపక్షాల అసత్యప్రచారాన్ని తిప్పికొట్టడంతో ప్రముఖపాత్ర పోషించాలన్నారు. నియోజకవర్గంలో రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మదనపల్లె–నిమ్మనపల్లె, మదనపల్లె–చెంబకూరు డబుల్‌రోడ్డు నిర్మాణం రూ.94 కోట్లతో చేపట్టడం జరిగిందన్నారు. గంగాపురం పల్లె నుంచి దర్గా కట్ట వద్దకు రూ.2కోట్లతో రోడ్డు నిర్మాణం, రూ.30కోట్లతో నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మురుగురోడ్లు, సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ రమణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సదాశివరెడ్డి, కొమ్మెపల్లె శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకోవాలి


సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

పీలేరు : విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఈవోలు బాలాజీ నాయక్, రంగనాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ మేళా నిర్వహించారు. ఎంఈవోలు విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శనలలో నూతన ఆవిష్కరణల వలన విద్యార్థుల్లో సైన్స్, గణితంపై ఆసక్తి పెరుగుతుందన్నారు. శాస్త్ర విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రగతికి తోడ్పాటు అవుతుందన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవాంజులు, సూర్యప్రకాష్, మురళి, మస్తాన్, సౌజన్య, శ్రీకళ, సురేష్, శివలింగం, సీఆర్పీలు మురళీధర్‌రాజు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి


ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మండలంలోని అగ్రహారం, చెట్లవాండ్లపల్లి, ఎగవ కుక్కలపల్లి, దిగవ కుక్కలపల్లి, బాగేపల్లి గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయం సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలంటూ ప్రజలను కోరారు. ఎంపీపీ మహమూద్, వైస్ ఎంపీపీ పట్టెరిక శోభా, జెడ్పీటీసీ శివన్న, కన్వీనర్ సుబ్బరాం, సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా నాయకులు కేవీ రమణ, కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు రహంతుల్లా,లక్ష్మీదేవి, ఎంపీటీసీ కేశవ్,స్థానిక నాయకులు బాబురెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మీపతి, గొర్ల శీనా, సమర, శంకర్, పాల శీనా, సోముతో పాటు మండలంలోని సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..: మండలంలోని కందుకూరు పంచాయతి అగ్రహారంలో పలువురు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా వేశారు. గుర్రం గంగాధర్, మొటుకుపారేసు, కొమ్ము గంగాద్రి, నవీన్, సోమశేఖర్, వెంకట్రమణ, రమేష్, ప్రసాద్ తదితరులు పార్టీలో చేరారు.

ఆర్టీసీని ఆదరించాలి

మదనపల్లె సిటీ: ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించాలని ఆర్టీసీ డిపో -1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిపో కార్యాలయంలో తంబళ్లపల్లె, బి.కొత్తకోట మార్గాల్లో ప్రయాణించిన ప్రయాణికుల కోసం లక్కీడ్రా తీశారు. బి.కొత్తకోట మార్గంలో శ్రీనివాసులు, కార్తీక్, గణేష్, తంబళ్లపల్లె మార్గంలో నరసింహులు, మాధవి, శ్వేతకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఎం రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

భైరీ నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసన

కలికిరి: హిందూదేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు భైరీ నరేష్‌పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యప్పస్వామి సేవా సమితి, బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక అయ్యప్ప ఆలయం నుంచి టిబి రోడ్డు, గాంధీ కూడలి వరకు ర్యాలీ చేశారు. హిందూ ఆలయాలను కించపరచేలా మాట్లాడటం సిగ్గుచేటని, అటువంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి చింతపర్తి మహేష్, అయ్యప్పస్వామి సేవా సమితి, బజరంగ్ దళ్ సభ్యులు యల్లారెడ్డి, నరేష్, లింగయ్య, శ్రీనివాసులు, క్రిష్ణ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి మహిళకు తీవ్రగాయాలు

ములకలచెరువు: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడడంతో ఒక మహిళకు తీవ్రగాయాలయ్యాయి. సత్యసాయి జిల్లా తనకల్లు మండలం వడ్డిపల్లెకు చెందిన జే.ప్రమీల తన కుమారుడు విష్ణుతో కలిసి ద్విచక్రవాహనంలో శనివారం ములకలచెరువుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో ములకలచెరువు జెడ్పీహైస్కూల్ మలుపు వద్ద అదుపుతప్పి కిందదడటంతో ప్రమీలకు తీవ్రగాయాలయ్యాయి.